# రాజితం

రిసెప్షన్ గది గోడ గడియారం వంక మరొకసారి చూశాను. ఎనిమిదీ ఇరవయి అయింది. నా చేతి గడియారం వంక చూసుకున్నాను ఎనిమిదిన్నర అయింది. కావాలనే వాచిని పదినిమిషాలు ముందుకు పెట్టుకుంటాను. ఎక్కడకీ ఆలస్యంగా వెళ్ళకూడదని, ఈవేళ ఎంచేతో ప్రతిచోటా ఆలస్యమవుతోంది. అంత చీకట్లో కార్పొరేటు ఆస్పత్రి పట్టుపగల్లో నుంచున్నట్టు ఉంది. విజిటింగ్ అవర్స్ ఎనిమిదింటికే దాటి పోయాయి. నేను ఏడింటికే వచ్చాను. విజిటింగ్ ఆవర్స్ ముగిపుకు ముందే వచ్చిన జనం పలచబడసాగారు. ఊరుకు బాగా దూరంగా ఉన్న ఆస్పత్రి సద్దుమణుగుతోంది. ఎ.సి. వలన గది చల్లగా ఉంది. గది చుట్టూ అద్దపు గోడలు నాలుగు గోడలకు గొప్ప ఆర్టు చిత్రాలున్నాయి. ఏ దేశం నుండి తెప్పించారో గాని గోడ గడియారం వినూత్నంగా ఉంది.

ఈ ఎదురుచూపులు నాకు విసుగనిపిస్తున్నాయి. నన్ను వెళ్ళనీయడం లేదు. అరగంట కొక సారయినా నర్సు వచ్చి 'మరికొద్దిసేపు దయచేసి ఆగండి. మేం మీ పనిలోనే ఉన్నాం' అని ఎంతో మర్యాదగా అంటోంటే చల్లబడి పోతున్నాను. మూడుసార్లేమో కాఫీ పంపించారు. నాకు మొఖమాటం ఎక్కువ. ఎవరయినా ప్లీజింగ్‌గా మాట్లాడితే కాదనలేను. హోటలు గదికి వెళ్ళి నా వస్తువులు సర్దుకోవాలి. పన్నెండూ నలభయికి ఎయిర్‌పోర్టులో ఉండాలి. ఉదయం మూడున్నరకు లండన్ ఫ్లయిటు ఉంది. రేపు నేను అక్కడకు చేరుకోవడం ముఖ్యం. లేకుంటే చాలా నష్టపోతాను. ఇప్పటికే నాకు తెలిసో, తెలియకో జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకుని చాలా కోల్పోయాను. ఇప్పుడిప్పుడే గాడిలో పడ్డాను. అద్దంలోంచి బయటకు చూశాను. నేను వచ్చిన టాక్సీ పార్కింగ్ లాట్‌లో ఉంది. ఎయిర్‌పోర్టులో నన్ను వదిలిపెట్టేంతవరకు ఉంటుంది. వెళ్ళే ముందు నేను చేయవలసింది ఒక్కటే మిగిలుంది. ఆయన కోసం పెద్దపూలగుత్తి కొన్నాను. 'మీరు త్వరగా బాగవ్వాలి' అని కార్డు మీద రాయించి పూలుగుత్తికి అతికించాను.

"సార్".

వెనక్కి తిరిగాను. రిసప్షన్ గది తలుపు సగం తెరిచి పట్టుకుని పలచటి నీలంరంగు డ్రస్‌లో ఉన్న సిస్టరు నిలబడి ఉంది. ఆమెకు ముప్పయి సంవత్సరాలు ఉండొచ్చు. అలా అనిపించడం లేదు. తక్కువ వయస్కురాలిలా ఉంది.

"రావుగారి గురించి వచ్చింది మీరేకదూ?" అడిగింది.

ఎవరయినా ఆడవాళ్ళు నన్ను హఠాత్తుగా ఏదయినా అడిగినప్పుడు వెంటనే జవాబు చెప్పలేను. గొంతులోంచి పెల్లుబికి మాటరాదు. చిన్నప్పటి నుండి అంతే, ఇంతవరకు పెళ్ళి చేసుకోక పోవడానికి కారణం అది కాదు.

తలూపాను.

"క్షమించండి. చాలా ఆలస్యం అయింది. రండి నా కూడా. ఆయన ఉన్న గదికి తీసుకువెళ్తాను" అంది.

సోఫాలో ఉన్న పూలగుత్తిని అందుకుని బయటకు వచ్చాను. నాక ఒక అడుగు ముందుకు నడుస్తూ, "మా కంప్యూటర్లు డౌన్ అయ్యాయి. మెయిన్టెనెన్స్ కంపెనీ వాళ్ళు వచ్చి రెండు గంటలుగా తంటాలు పడుతున్నారు. ఇంతవరకు బాగయితేనా? కంప్యూటర్ మంచిగా ఉంటే ఒక్క నిమిషంలో మీకు కావలసిన రావుగారు ఏ గదిలో లేక ఏ వార్డులో ఉన్నారో తెలిసిపోయేది. నాలుగయిదు రిజిస్టర్లు తిరగవేస్తేగాని ఆయన ఉన్న గది దొరకలేదు. మీరాయన అబ్బాయనుకుంటాను. మీ పేరు?" ఎంత వేగంగా నడుస్తోందో అంత వేగంగా మాట్లాడుతోంది. నాకు ఆమెతో నడవడం నెమ్మదిగా పరుగెత్తడంలా ఉంది.

నా పేరు చెప్పి, "ఆయనకు ఎలా ఉంది?" అడిగాను.

"అలానే ఉంది" అంది.

లిఫ్ట్‌లో ఎనిమిదో ఫ్లోరు నొక్కింది. అదే చివరిది.

"మీకు శ్రమ కలిగిస్తున్నాను" అన్నాను.

"చాలాసేపు వెయిట్ చేయించి మీకే ఇబ్బంది కలిగించాం...."

లిఫ్ట్ కదులుతోంది.

లిఫ్ట్ నెంబర్ల వంక చూస్తూ, "రావుగారి వ్యాధి గురించి మీకు తెలిసి ఉండాలి పోయిన సారి మీ అక్కయ్య వాళ్లు వచ్చినప్పుడో, మీరొచ్చినప్పుడో.. మీరు కాదు... సిస్టర్ స్టెల్లా చెప్పానంది. మీ దగ్గర దాయడం ఎందుకు? ఆయనకు ఎయిడ్స్. సరయిన ఆహారం ఉండుంటే ఆరోగ్యంగా ఉండేవారు... ఆయన జబ్బు తెలిసిన తర్వాత మీ వాళ్ళు ఆయనను చూడటానికి రావడం మానేశారు... మీరెక్కడ ఉంటున్నారు?" అడిగింది.

"ఇంగ్లాండులో".

"మీకు తెలిసి ఉండాలి".

"తెలియదు. నిజంగా తెలియదు".

"మీ అక్కావాళ్ళతో మీకు మాటలు లేవా?"

జవాబు చెప్పేలోపల లిఫ్ట్ ఎనిమిదో ఫ్లోరులో ఆగింది. తలుపులు తెరుచుకున్నాయి. బయటకు వచ్చాం. పొడుగాటి నడవ చల్లగా చచ్చిపోయిన వెలుగంత నిశ్శబ్దంగా ఉంది.

ముందుకు నడుస్తూ, "ఆయనకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఉండడం మంచిదయింది. ఇంకో ప్లస్ పాయింటేమిటంటే మీ నాన్నగారూ మా ఛైర్‌మెన్ ఇంటరు వరకు కలిసి చదువుకున్నారు" అంది.

చాలా గదులు ఖాళీగా ఉన్నట్టున్నాయి. గది బయట తాళాలు వేసి ఉన్నాయి. క్వారెంటయిన్ వార్డులా ఉన్నట్టుంది. నడవ చివరి గది దగ్గర ఆగి తలుపు నెమ్మదిగాతెరచి ముందామె గదిలోకి నడిచింది. ఆమె వెనకే నేను లోపలికి వచ్చాక నా వెనక తలుపు చప్పుడు కాకుండా మూసుకుపోయింది. గది బయటకన్నా లోపల వెచ్చగా ఉన్నట్టుంది. గది అంత పెద్దగా లేదు. కిటికీ తలుపులు తెరిచి ఉన్నా గదిలో మందుల ఘాటు కొడుతోంది.

సిస్టరు గోడ దగ్గరున్న ప్లాస్టిక్ కుర్చీ మంచానికి దగ్గరగా లాగి నా వంక చూస్తూ, "కూర్చోండి. మీరాయనతో మాట్లాడవచ్చు. తాకవచ్చు. భయపడనవసరం లేదు. మీకిక్కడ ఉండడం ఇష్టం లేక వెళ్ళిపోదలిస్తే ఈ రెడ్ బటన్ నొక్కండి. ఏ అత్యవసర పరిస్థితి ఎదురయినా ఈ బటనే నొక్కండి. నేను రేపు ఉదయం ఆరింటివరకు డ్యూటీలో ఉంటాను" అని వెళ్ళిపోబోతోంటే, "మీపేరు?" అడిగాను.

"మెర్సీ" అంది. అని గదిలోంచి బయటకు వెళ్ళబోతూ ఆగి, వెనక్కి తిరిగి వచ్చి మంచం మీద పడుకున్న ఆయన్ని తట్టి, "సార్.. రావుగారూ.. ఒకసారి కళ్ళు తెరిచి ఎవరొచ్చారో చూడండి...." అంది.

ఆయన కళ్ళు తెరిచి ముందు మెర్సీ వంక చూశాడు.

"అటు.... అటు" నా వయిపు చూపించింది.

నావంక చూశాడు. మీట నొక్కగానే గది వెలుగుతో నిండిపోయినట్టు ఆయన ముఖం ప్రకాశవంతమయింది. తన బలహీనమయిన చేత్తో నా చేయి పట్టుకుని, ఆమె వంక చూస్తూ, "మా వాడు, మా అబ్బాయి...." ఎంతో గర్వంగా అన్నాడు.

"మీ అబ్బాయిని మీ దగ్గరకు తీసుకువచ్చినందుకు రేపు మాకు స్వీట్లు పంచిపెట్టాలి" అంది మెర్సీ వెళ్లడానికి తలుపు వయిపు కదులుతూ.

"థేంక్యూ, థేంక్యూ, తప్పకుండా మీకు స్వీట్లిస్తాను" ఆయన అంటున్నాడు, ఆమె బయటకు వెళ్ళిపోయింది.

గది నిశ్శబ్దమయింది. గాలికి కిటికీ తెరలు అలల్లా కదులుతున్నాయి. ఆయన మంచానికి దగ్గరగా కుర్చీలో కూర్చున్నాను. ఏం మాట్లాడాలో అర్థం కావడం లేదు. ఆయనకు అరవయి సంవత్సరాలుండొచ్చు గాని ఏ ఎనభయి సంవత్సరాల వ్యక్తిలానో అనిపిస్తున్నాడు. తలమీద జుట్టు అట్టే లేదు. ముఖం పీక్కుపోయి ఉంది. మాటలు నీరసంగా ఉన్నాయి. ఒకసారి పొడిగా దగ్గి, "నువ్వు నన్ను చూడడానికి వస్తావని నేననుకోలేదు. ... నా మీద కోపం పోయిందా?" అంటోంటే ఆయన గొంతులో దుఃఖం జీరగా కదిలింది.

కొద్ది కొద్దిగా ఈజ్ కాసాగాను. నా చేత్తో ఆయన కుడి అరచేతిని తడుముతూ,"అదేం లేదు. నేనిక్కడ ఉండడం లేదు...." అంటోంటే నా మాటలకు అడ్డు తగిలి, "ఈ విషయం మెర్సీ సిస్టర్ నాతో ఉంది.. మునుపు లేదు కాని నాకీమధ్య మతిమరుపు వస్తోంది. మర్చిపోతానో ఏమో ఈ తాళం చెవి.... నీ దగ్గరుంచు. జాగ్రత్త." అని దిండుకింద నుండి తాళం చెవి తీసి నా చేతిలో పెట్టాడు. అది ఇంటి తాళం చెవో, ఏ బేంకు లాకరుదో అడగాలనిపించలేదు. ఆ తాళంచెవి ఆయన చేయంత చల్లగా ఉంది.

"నువ్వు తప్ప నాకు ఎవరున్నారు?" అన్నాడు. కొద్దిసేపాగి, "కావాలని నేనందరినీ దూరం చేసుకున్నానా?" అడిగాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. తుడిచి, "అయిపోయిన వాటి గురించి తలుచుకుని ఇప్పుడెందుకు బాధ పడడం?" అన్నాను. "మీరు ఎవరినీ దూరం చేసుకోలేదు" అని అనాలా వద్దా తెలియలేదు.

నా ముఖంలోకి చూస్తూ, "నాకు కుడికన్ను పూర్తిగా కనిపించదు. రెటీనాపతి అని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో మూడుసార్లు లేజరు ట్రీట్‌మెంట్లిచ్చి త్వరలో నయమయి స్పష్టంగా చూడగలుగుతారని చెప్పరు. కొద్దో గొప్పో ఉన్న చూపు మందగించింది. 'శుక్లం ఏర్పడింది. అది తీసి లెన్సు పెడితే చూపు సరి అవుతుందన్నారు. శుక్లం ముదిరాక ఆపరేషన్ చేశారు. ఎక్కడ పొర పాటయిందో ఏమో చూపు పూర్తిగా పోయింది. 'రెటీనాపతి అయితే రెండో కంటి చూపు ఈసరికి మందగించి ఉండాలి కదా?' అని అడిగితే సరయిన జవాబు రాలేదు. పిల్లిమీద ఎలుక, ఎలకమీద పిల్లిలా

ఒక డాక్టరు మీద మరో డాక్టరు నెపాలు వేసుకోవడం తప్పఏమీ చేయలేదు. అశ్రద్ధ వలన పొరపాట్లు చేసి చాలామంది డాక్టర్లు తప్పించుకుంటున్నారు. కోర్టులు డాక్టర్ల మీద ఈగ వాలనివ్వడం లేదు. ఇప్పుడు రెండోకంటికి శుక్లం వచ్చింది. అది ముదరాలి. ఆ కంటి చూపు కూడా స్పష్టంగా లేదు.

"నేనిక్కడకు వచ్చి ఇది రెండో నెల. ఈ దశలో నేను బాగవుతానని అనుకోవడం లేదు. ఇన్సూరెన్స్ వాళ్ళకూ వీళ్ళకు ఏవో ఒప్పందలు ఉంటాయి. లేక గినియాపిగ్ లాగా నా మీద రకరకాల మందులతో ప్రయోగాలు ఏమయినా చేస్తున్నారేమో నాకు తెలియదు. మందుల కంపెనీలకు వీళ్ళకూ లాలూచీలుంటాయి.

"ఒక సంగతి చెప్పడం మర్చిపోయాను. ఈ ఆస్పత్రికి మెడికల్ కాలేజీ ఉంది. దానికి శవాలు కావాలి. చూస్తుంటే బతికుండగానే నన్ను శవాల గదిలోకి తీసకెళ్ళేట్టున్నారు.." అని నవ్వి, "మరణానంతరం నా శవాన్ని మామెడికల్ కాలేజీకి దానం చేసే ఉద్దేశం ఉందా?" అని అడిగారు. ఇవ్వాలనే అనిపించింది. చాలాసేపు ఆలోచించాక వద్దనే అనిపించింది. ఏవేవో కాయితాలు తీసుకువచ్చి నాకిచ్చి పూర్తిచేయమన్నారు. చేయలేక పోయాను. పట్టుమని నాలుగు కాలంలు రాయలేకపోయాను. బొత్తిగా శక్తిలేదు. రెండు కాలంలు పూర్తి చేసేసరికి చేతివేళ్ళు నొప్పి పుట్టాయి. పూర్తి చేయలేకపోయాను. "మీరు వేలిముద్ర వేసివ్వండి, ఫారాలు మేం పూర్తి చేసుకుంటాం" అన్నారు. నేను వేలిముద్ర వేయకపోయినా చనిపోయాకయినా తీసుకుంటారు. 'మా అబ్బాయి ఈవేళో, రేపో వస్తాడు. వాడికో మాట చెప్పి ఏ సంగతీ నిర్ణయించుకుంటాను' అనేసరికి నన్ను తొందరపెట్టడం మానేశారు. కానీ, మార్చురీ ఇన్‌చార్జ్ మటుకు రోజూ వచ్చి నన్ను పలకరించి వెళ్తున్నాడు... నువ్వు వచ్చాక నాకెంత ధైర్యం వచ్చిందో తెలుసా?

"నువ్వు నమ్ముతావో, నమ్మవో గాని నేను తిరుగుబోతును కాను. ఈ వ్యాధి బారిన పడిన కారణం ఏమిటంటే చిన్న పనిమీద నల్గొండ వెళ్ళినప్పుడు పెద్ద ప్రమాదం జరిగింది. చనిపోవలసిన వాడిని. రక్తం చాలాపోతే అక్కడే నాలుగయిదు సీసాల రక్తం ఎక్కించారు. ఆ సమయంలోనే పొరపాటు జరిగింది. జబ్బు ముదిరాక గాని గ్రహించలేకపోయాను. అన్నీ చేతులారా నేను చేసుకున్నట్టయింది. నేను చనిపోయినా చూడడానికి అక్క వస్తుందని నేను అనుకోవడం లేదు. అమ్మ చాలా మంచిదిరా. నా అశ్రద్ధ వలనే అమ్మను పోగొట్టుకున్నాను. ఇంత సంపాయించి ఏం తీసుకువెళ్ళబోతున్నాను?" అంటోంటే ఆయన దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆయన్ని

ఆపలేదు. గూడు కట్టుకున్న బాధ బయటకు వస్తే మనసు తేలిక అవుతుంది. ఆయన చేతులు మార్చి మార్చి నిమురుతూ ఉండిపోయాను. ఆయన చేతులు నిమరడం ఆపగానే కళ్ళు మూసుకుని ఉన్నవాడల్లా చటుక్కున కళ్ళు తెరిచి నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"ఎలా ఉంది?" అడిగాను.

"నిద్ర వస్తోంది. నిద్రపోతే నువ్వు వెళ్ళిపోతావేమోనని భయంగా ఉంది,"

"నేను వెళ్ళను, నామాట నమ్మండి" అన్నాను.

"అలసటగా ఉంది."

"నిద్రపొండి."

నా చేతిని తన గుండె మీద పెట్టుకుని ముప్పావు గంటేమో నిద్రపోయాడు. సమయం చూడడానికి నా చేతిని తీసుకునేప్పుడు గమనించాను. ఆయన చేతులు గట్టిపడుతున్నాయి. మెడకింద వేళ్ళు పెట్టి చూశాను. నిద్రలోనే పోయాడు.

నేను తెచ్చిన పూలగుత్తి ఆయన గుండెల మీద పెట్టి నుదుటిమీద ముద్దుపెట్టుకుని రెడ్ బటన్ నొక్కాను. రెండు నిమిషాలు కాకముందే మెర్సీ గదిలోకి వచ్చింది. ఆమెను చూడగానే నాకు దుఃఖం ఆగలేదు. చిన్నపిల్లాడిలా ఏడ్చేశాను. ఆమె నన్ను ఆపలేదు. నా వంకే చూస్తూ ఉండిపోయింది.

మనసు కుదుట పడ్డాక, "మీరు పొరబడ్డారు. ఈయన మా నాన్న కాదు." అన్నాను.

"నాకు తెలుసు. మీకుశ్రమ ఇచ్చినందుకు దయచేసి నన్ను క్షమించండి. రావుగారు చనిపోతారని తెలుసు. బహుశా ఆయనకూ తెలుసనుకుంటాను. చివరిక్షణాల్లో ఆయనకు తన కొడుకు కావాలి. కొడుకుతో తన మనసు పంచుకోవాలి. ఆయనకు మీరు శాంతినిచ్చారనే అనుకుంటున్నాను అసలు విషయం చెప్పమంటారా?"

"చెప్పండి"

"ఆయన కొడుకు ప్రమాదంలో చనిపోయి, ఇరవయి సంవత్సరాలయింది..." చెబుతోంది.

చేతులు జోడించి మెర్సీకి నమస్కారం చేస్తోంటే కళ్ళల్లో నీళ్ళు ఆగటం లేదు. ఆమె నా ఆత్మ స్పృశించి ఉండక పోతే ఎవరూ లేని నాకు తండ్రి ప్రేమ తెలిసి ఉండేది కాదు.

* ఆదివారం ఆంధ్రజ్యోతి 22, మే 2011

బి.పి.కరుణాకర్